నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, సోమవారం 9 డిసెంబర్ 2024 RANGAREDDY


అప్పాయిపల్లిలో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు



ధారూరు : మండలంలోని కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొన్నది. చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తూ సంతోషంగా గడిపారు. చుట్టూ పక్కల ప్రాంతాల వారే కాకుండా వివిధ జిల్లాల నుంచి కుటుంబ సమేతంగా వచ్చి వనభోజనాలు చేశారు.

# తడిసిన ధాన్యాన్ని కొనాలి

**తేమ శాతం పేరిట తిప్పి పంపొద్దు**

**17 శాతం తేమ ఉన్నా కొనుగోలు చేయాలి**

**లేకుంటే మొలకలొచ్చి.. అప్పుల పాలవుతాం**

**అకాల వర్షం నిండా ముంచింది : అన్నదాతలు**

**ఇటీవల కురిసిన వానలతో తడిసిన ధాన్యం**

కొడంగల్, డిసెంబర్ 8 : అకాల వర్షం తమను నిండా ముంచిందని.. తీరని నష్టాన్ని మిగిల్చిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తేమ శాతాన్ని తగ్గించేందుకు రోడ్లపై ఆరబెట్టిన వరి ధాన్యం ఇటీవల కురిసిన వానలకు తడిసిపోవడంతో రైతన్న తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాడు. నానిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తే అక్కడి సిబ్బంది 14% లోపు తేమ ఉంటేనే కొంటామని కరాఖండిగా చెబుతున్నారని వాపోతున్నాడు. తేమ శాతం 17 వరకు ఉన్నా కొనాలని ప్రభుత్వ నిబంధనలు చెబుతున్నా వారు మాత్రం కొనడం లేదని పేర్కొంటున్నాడు. రోడ్లపై ఆరబోసిన వందలు, వేల బస్తాల ధాన్యం ఇటీవల కురిసిన అకాల వర్షానికి తడిసి ముద్దైందని.. వాతావరణం మేఘావృతంగా ఉండడంతో ఆరబెట్టినా సరిగ్గా ఎండక మొలకెత్తే ప్రమాదం ఉన్నదని కంట తడి పెడుతున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తే అక్కడి సిబ్బంది తిరిగి పంపిస్తున్నారని.. తమ పంటను కొనుకుంటే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉన్నదని బాధపడుతున్నారు. పంటల సాగుకు చేసిన అప్పులను తీర్చే మార్గమే ఉండదని, తమ బతుకులు అగమ్యగోచరమేనని పేర్కొంటున్నారు. అకాల వర్షం తమకు అపార నష్టాన్ని మిగిలించిందని.. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాల్లో తడిచిన ధాన్యాన్ని తేమ శాతంతో సంబంధం లేకుండా కొనేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### కొర్రీలతో తప్పని అవస్థలు..



వరి ధాన్యాన్ని విక్రయించుకునేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటైనా అక్కడి కొర్రీలతో అవస్థలు పడుతున్నాం. తేమ శాతం 17 ఉన్నప్పటికీ ధాన్యాన్ని కొనాలని నిబంధనలున్నా 14 శాతం తేమ ఉన్నా అక్కడి సిబ్బంది కొనుగోళ్లు చేపట్టడం లేదు. గతంలో ముందుగా ఖాళీ బస్తాలు ఇచ్చేవారు.. ఇప్పుడు ఇవ్వడం లేదు. దాంతో పంటను ఎక్కడ, ఎలా నిల్వ చేసుకోవాలో అర్థం కావడం లేదు. బస్తాల్లేక ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించలేకపోతున్నాం.

–బుగ్గప్ప, అప్పాయిపల్లి, కొడంగల్

### తడిసిన ధాన్యాన్ని చూస్తే ఏడుపొస్తున్నది..



తడిసిన ధాన్యాన్ని చూస్తే ఏడుపొస్తున్నది.. తేమ శాతాన్ని తగ్గించేందుకు రోడ్లపై ఆరబెట్టిన వరి ధాన్యం అకాల వర్షంతో పూర్తిగా తడిచిపోయింది. ఆ ధాన్యాన్ని ప్రభుత్వం కొంటేనే నష్టపోకుండా ఉంటా. అప్పులు చేసి పంటను సాగు చేశా. అసలే పంట దిగుబడి తక్కువగా వచ్చింది. దానికి తోడు వర్షంతో పూర్తిగా తడిచి పోయింది. దానిని చూస్తుంటే కంట నీరు ఆగడం లేదు. కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తే తేమ శాతం ఎక్కువగా ఉన్నదని తిప్పి పంపిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తడిచిన ధాన్యాన్ని కొనేలా చర్యలు తీసుకోవాలి.


– బుగ్గమ్మ, అప్పాయిపల్లి, కొడంగల్




సొంతిళ్లు లేక పూరి గుడిసెకు కవర్లు కప్పుకొని నివాసముంటున్న పేదలు

*జిల్లాలోని పేదలు సొంతింటి కోసం ఎదురు చూస్తున్నారు. చాలా మంది అప్పోసప్పో చేసి స్థలాలు కొనుగోలు చేశారు. ఇందిరమ్మ పథకంలో నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇవ్వడంతో.. ఇంటి నిర్మాణానికి డబ్బుల్లేని పేదలు ఇందిరమ్మ ఇండ్ల కోసం నిరీక్షిస్తున్నారు. తాజాగా, ప్రజాపాలనలో అప్లికేషన్ పెట్టుకున్న వారికి ఇంటి నిర్మాణానికి నిధులిస్తామని సర్కారు చెప్పడంతో దరఖాస్తులుదారుల్లో కొత్త ఉత్సాహం నెలకొన్నది. అయితే, జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కోసం ప్రజాపాలనలో 3,75,000 మంది పేదలు దరఖాస్తు చేసుకున్నారు. అయితే రేవంత్ సర్కార్ నియోజకవర్గానికి 3500 చొప్పన మాత్రమే ఇండ్లను కేటాయించడంతో అర్హులందరికీ ఇండ్లు వస్తాయా..? పేదలు, గుడిసెవాసుల సొంతింటి కల నెరవేరేనా..? అన్న సందేహం, అయోమయం నెలకొన్నది.*

*-రంగారెడ్డి, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ)*




# దరఖాస్తులు లక్షల్లో..
# కేటాయింపు వేలల్లో..

జిల్లాలో ప్రజాపాలన కింద 3,75,000 మంది డబుల్‌బెడ్ రూమ్‌ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. నిరుపేదలతోపాటు సొంత స్థలం ఉండి ఇండ్లు నిర్మించుకునేందుకు ఆర్థిక స్థోమత లేని వారంతా ఇందిరమ్మ ఇండ్ల కోసం అప్లికేషన్ పెట్టుకున్నారు. అయితే రేవంత్ సర్కారు మాత్రం నియోజకవర్గానికి 3,500 ఇండ్ల చొప్పున మాత్రమే ఇస్తామని ప్రకటించడంతో అవి ఏ మూల సరిపోని పరిస్థితి నెలకొన్నది. ప్రభుత్వ ప్రకటన అర్హులైన లబ్ధిదారుల ఆశలపై నీళ్లు చల్లినట్లయ్యింది. దీంతో చాలామంది కాంగ్రెస్ పార్టీ నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఇప్పటికే ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు కోసం గ్రామ, మండల స్థాయిలో కమిటీలనూ వేసింది. అందులో కాంగ్రెస్ నాయకులే ఉండడంతో ఇండ్ల కేటాయింపు కూడా వారి చేతుల్లోనే ఉంటుందని పైరవీల బాటపట్టారు.

### అర్హులందరికీ ఇండ్లు నిర్మించి ఇవ్వాలి..



అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలి. ఎన్నో ఏండ్లుగా సొంత ఇండ్లు లేక పేదలు అనేక అవస్థలు పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేర్చాలి. సెగ్మెంట్‌కు 3,500 ఇండ్లు ఏ మాత్రం సరిపోవు. వాటిని పెంచాలి. కొన్నేండ్లుగా గుడిసెల్లో జీవిస్తున్న ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలి.

–కావలి నర్సింహ, సీపీఐ నాయకుడు

### పేదలకు న్యాయం చేయాలి



అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదల సొంతింటి కలను నెర వేర్చాలి. చాలామంది అప్పోసప్పో చేసి స్థలాలు కొనుగోలు చేశారు. ఇండ్లను నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేక అద్దె ఇండ్లలో ఉంటున్నారు. కొందరు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారు. వారందరికీ ఇందిరమ్మ పథకం కింద నిధులు మంజూరు చేసి ఆదుకోవాలి. బ్రోకర్లకు ఆస్కారం ఇవ్వొద్దు.

– జగదీశ్, సీపీఎం నాయకుడు

### గుడిసె వాసులకు ఇండ్లు దక్కేనా..

రాష్ట్రంలోనే రంగారెడ్డి జిల్లా పరిస్థితి ఇతర జిల్లాల కంటే భిన్నంగా ఉంటుంది. ఈ జిల్లా హైదరాబాద్ చుట్టూ విస్తరించి ఉండడంతో పెద్ద అంబర్‌పేట, హయత్‌నగర్, ఆదిబట్ల, తుక్కుగూడ, రాజేంద్రనగర్, ఇబ్రహీంపట్నం, శంషాబాద్ వంటి మున్సిపాలిటీలకు ఇతర రాష్ట్రాలు, ఇతర జిల్లాల నుంచి వేలాది మంది వచ్చి ఉపాధి పొందుతున్నారు. వారిలో చాలా మంది కొన్నేండ్లుగా ఇక్కడే నివసిస్తూ ఆధార్, రేషన్‌కార్డులను కూడా పొందారు. వారిలో చాలామంది స్థలాలు కొనుగోలు చేసి.. ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు కూడా చేసుకున్నారు. వారిలో ఎంతమందికి ఇండ్లు వస్తాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొన్నది.



# మాఫీ అయ్యేనా !

## రూ.2 లక్షలపైన రుణాలున్న రైతుల్లో ఆందోళన.. స్పష్టతనివ్వని కాంగ్రెస్ ప్రభుత్వం

వికారాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం.. ఏడాది పాలనలో జిల్లా రైతాంగాన్ని ఆగం చేసింది. రైతు భరోసా, ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ అంటూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చాక విస్మరించింది. రూ.2 లక్షల రుణాలను ఒకే విడుతలో మాఫీ చేస్తామంటూ ప్రకటించినప్పటికీ గత నాలుగు నెలలుగా రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతున్నది. రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకొని రుణమాఫీ ప్రక్రియను ప్రభుత్వం చేపట్టడంతో అర్హులైన రైతులకు నష్టం జరిగింది. ఇప్పటి వరకు మూడు విడుతల్లో రూ.1.50 లక్షల్లోపు పంట రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. నాలుగో విడుతలో రూ.2 లక్షల్లోపు రుణాలున్న రైతులకు సంబంధించిన జాబితాను ప్రకటించింది. వారం రోజుల్లో సంబంధిత రైతుల బ్యాంకు ఖాతాల్లో రుణమాఫీ డబ్బును జమ చేసేందుకు ప్రభుత్వం ప్రకటించింది. రూ.2 లక్షలకుపైన రుణాలున్న రైతుల్లో మాత్రం రుణమాఫీ అవుతుందా.. కాదా.. అన్న ఆందోళన నెలకొన్నది. ఎందుకంటే ప్రభుత్వం నుంచి ఇప్పటికీ ఎలాంటి స్పష్టత లేకపోవడంతో రైతులు అయోమయంలో ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టు 15లోపు రూ.2 లక్షల రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించింది. రూ.2 లక్షలపైన ఉన్న రుణాలను ఆగస్టు 15లోపు చెల్లించకపోతే మాఫీ వర్తించదని సంబంధిత అధికారులు స్పష్టం చేయడంతో చాలా మంది రైతులు రూ.2 లక్షలపైన ఉన్న మొత్తాన్ని చెల్లించారు. కటాఫ్ రుణాన్ని చెల్లించినా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల మాట ప్రకారం రూ.2 లక్షలపైన ఉన్న మొత్తాన్ని చెల్లించిన రైతులు**

**రూ.2లక్షల రుణాలున్న రైతులు జిల్లాలో సుమారు 2 వేల మంది**

**మూడు విడుతల్లో 90,168 రైతులకు రూ.751 కోట్ల రుణాలు మాఫీ**

**నాలుగో విడుతలో అర్హులైన రైతులు 10,660 మంది**

### మాఫీ చేసి, మాట నిలబెట్టుకోవాలి..



మర్పల్లి కో–ఆపరేటివ్ బ్యాంక్‌లో రూ.2.03 లక్షల రుణం తీసుకున్నా. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షలకు పైగా ఉన్న మొత్తాన్ని చెల్లించాలని చెప్పింది. అప్పు చేసి పైన ఉన్న మొత్తాన్ని చెల్లించా. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి.

– నీలి శంకరయ్య, మర్పల్లి

### కాంగ్రెస్ మాటల గారడీ చేస్తున్నది..



కాంగ్రెస్ ప్రభుత్వం మాటల గారడీ చేస్తున్నది. రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి కొంతమందికే వర్తింపజేయడం సరికాదు. అర్హులందరికీ ఎలాంటి నిబంధనలు, కొర్రీలు లేకుండా రుణమాఫీ చేసి, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.

– రాములు, విఠ్యల గ్రామం, ఫరూఖ్‌నగర్ మండలం

### రూ.2 లక్షలకుపైన మొత్తాన్ని చెల్లించిన రైతులు..

పట్టాదారు పాసు పుస్తకాలను కాకుండా రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోవడంతో చాలా మంది అర్హులైన రైతులు నష్టపోయారు. రూ.2 లక్షలపైన ఉన్న మొత్తాన్ని చెల్లిస్తేనే రుణమాఫీ వర్తిస్తుందని వ్యవసాయాధికారులు చెప్పడంతో కొంతమంది రైతులు చెల్లించారు. జిల్లా వ్యవసాయాధికారుల మాట విని జిల్లాలో రూ.2 లక్షలపైన రుణాలున్న సుమారు 2 వేల మంది రైతులు కటాఫ్‌నకు పైన ఉన్న రుణ మొత్తాన్ని చెల్లించి రసీదులను వ్యవసాయాధికారులకు అందజేశారు. ఒకవైపు రుణాలను మాఫీ చేస్తున్నామంటూనే తిరిగి రైతుల నుంచి ముక్కు పిండి వసూలు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికలకు ముందు ప్రగల్భాలు చెప్పి ఇప్పుడు నట్టేట ముంచుతుండడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రుణాలు రూ.2 లక్షల పైచిలుకు ఉన్న రైతులు మిగతా రుణాలను చెల్లించేందుకు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులపాలయ్యారు. పంట పెట్టుబడికి అప్పులు చేసిన రైతులు, రుణమాఫీ వర్తించేందుకు అప్పులు చేయడం తీవ్ర భారంగా మారింది. ఆగస్టు చివరి వారంలో విధివిధానాలు తెలియజేస్తామని అధికారులు తెలిపినప్పటికీ ఇప్పటివరకు నిబంధనలు ఏమిటో ఖరారు కాకపోవడం గమనార్హం.

# ప్లాట్లు అమ్మి మోసం చేశారు..

**లేఅవుట్ ప్రాంతంలో టెంటు వేసుకుని బాధితుల ఆందోళన**

**శ్రీనివాస డెవలపర్స్‌పై మండిపాటు**

పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 8 : మున్సిపాలిటీ పరిధి పసుమాములలోని శ్రీనివాస డెవలపర్స్ పేరుతో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో ప్లాట్లు కొన్న తమను డెవలపర్స్ మోసం చేశారని బాధితులు మండిపడ్డారు. తమకు న్యాయం చేయాలని ఆదివారం లేఅవుట్ ప్రాంతంలో టెంటు వేసుకుని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా బాధితులు నవీన్‌రెడ్డి, రమాదేవితోపాటు పలువురు మాట్లాడుతూ.. పసుమాముల సర్వేనంబర్ 94, 100 లో 2019లో సుమారు 10.14 ఎకరాల్లో శ్రీనివాస డెవలపర్స్ పేరిట లేఅవుట్ చేయగా.. అందులో 250 మంది వరకు ప్లాట్లు కొన్నామన్నారు. పట్టాదారుల వద్ద భూమిని జీపీఏ చేసుకున్న డెవలపర్స్.. ప్లాట్లన్నీ అమ్మేశారన్నారు. అయితే, పట్టాదారులకు పూర్తిగా డబ్బులు చెల్లించకపోవడం తో వారు 10.14 ఎకరాల్లోంచి తిరిగి నాలుగు ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవడంతోపాటు నాలా కన్వర్షన్ అయిన భూమిని తిరిగి ధరణి పోర్టల్‌లో ఎక్కించుకున్నారని, ఆరు నెలల కింద ప్లాట్ల హద్దురాళ్లను కూడా తొలగించారని బాధితులు పేర్కొన్నారు. ఈ విషయాన్ని డెవలపర్స్ దృష్టికి తీసుకెళ్తే తమకు సంబంధం లేదని చేతులెత్తేశారని ఆవేదన వ్యక్తంచేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బాధితులు యాదగిరిరెడ్డి, మల్లేశ్, శ్రవంతి, మహేందర్, సాయితేజ, శ్రీనివాస్, విజయ్‌కుమార్, పృథ్వీరాజ్‌రెడ్డి, కమల్, జంగారెడ్డి, శోభారాణి పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న ప్లాట్ల బాధితులు